# అదుపాజ్ఞలు

[కథానిక]

= శ్రీ 'జమదగ్ని' =

వాకిట్లో చెప్పుల చప్పుడయింది.

వస్తున్నది నాన్నే!

మధ్యసావిడి పక్కగదిలో గీర్వాణం ఆనుకుని చదువుకుంటున్న గోపాలం ఉలిక్కిపడి వెన్ను నిక్కబొడిచి గట్టిగా చదవడం మొదలుపెట్టాడు. అంతకుముందు లోపల్లోపల శ్రద్ధగానే చదువుకుంటున్నాడు పాపం. అదిరిపోయి అకస్మాత్తుగా పైకి చదవడంలో వర్ణలోప, వర్ణాగమ, వర్ణవ్యత్యయాలు వరుస తప్పకుండా ఒక్కుమ్మడిగా దొర్లడం మొదలుపెట్టాయి.

వెంకట్రామయ్యమనసులో అబ్బాయి అశ్రద్ధకు కోపం పొంగడం మొదలుపెట్టింది.

తండ్రి తన్ను సమీపించినకొద్దీ గోపాలం చదువు జోరుగా సాగించాడు. జోరెక్కువైన కొద్దీ తప్పులూ ఎక్కువవుతున్నాయి. అంతకంతకు మాటలే మింగుడుపడిపోతున్నాయి. అప్పుడప్పుడు తండ్రివంక చూడడానికి చేసే ప్రయత్నంలో పంక్తులుగూడా లోపిస్తున్నాయి.

ఇక సహించలేకపోయాడు వెంకట్రామయ్య. విసుగుతో ఉత్తరీయం దండెన పారేసి, చొక్కా అయినా విప్పుకోకుండా అమాంతం వచ్చి అబ్బాయిముందు కూర్చున్నాడు. అంతే. గోపాలం నోరు బంద్ అయిపోయింది. కళ్లు మాత్రం పుస్తకంవంకే చూస్తున్నాయి.

కళ్లు పెద్దవిచేసి "ఆపేశావేం?" అన్నాడు తండ్రి.

గోపాలం టిక్కుముఖం పెట్టాడు.

ఇల్లంతా అతినిశ్శబ్దంగా ఉంది.

చెయ్యి చెవిదగ్గరకు పోనిస్తూ "చదవ్వేమిరా" అన్నాడు తండ్రి.

అతని మాట అతని నోట్లోనుంచి బయటికి పూర్తిగా రాకముందే గోపాలంముఖం ఏడుపుముఖం అయిపోయింది.

అంతదాకా వెళ్లిన ఆయనచెయ్యి ఊరుకోలేదు. లోపల్లోపల కాగిన పాలు అమాంతం పొంగినట్లు, నిశ్శబ్దతను చీల్చుకుని గోపాలందుఃఖం బయటికి వచ్చింది. ఒక చేతిలో పుస్తకం వణుకుతూ ఉండగా రెండోచేతి మణికట్టుతో కళ్లు నలుముకుంటూ, చెవిపట్టుకున్న తండ్రిచేతి నప్పుడప్పుడు తోస్తూ వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టాడు.

"ఇదీ తతంగం! రోజూ నీ కిది ఒక ఆటగా ఉంది. నే వచ్చి చదవమనేటప్పటికి దొంగ ఏడుపు లేదుస్తావ్. వెధవా!" అని అంటూ చెంప పగలగొట్టాడు తండ్రి.

గోపాలం పుస్తకం కిందపడేసి రెండుచేతులతో పనిచెప్పి కాళ్లాడిస్తూ 'అమ్మా' అంటూ గిలగిలలాడిపోయాడు. దిబ్బపండు చాయ గోపాలం చెంప కాబూల్ దానిమ్మపండుచాయకు రావడం కిరసనాయిల్ దీపపు వెలుగులో ఆతండ్రి గమనించలేదు.



"చెయ్యి చెవిదగ్గరకు పోనిస్తూ 'చదవ్వేమిరా' అన్నాడు తండ్రి."

"అన్నకొద్దీ మరీఏడుస్తావ్! ముందు ఏడుపు మానెయ్యి" అని పళ్లు బిగించి అంటూ మళ్లీ చెయ్యి ఎత్తాడు తండ్రి.

మళ్లీ దెబ్బపడుతుందన్న భయంతో స్వరం తగ్గించడానికి గోపాలం ప్రయత్నం మొదలుపెట్టాడు.

"ఇంకా వినపడుతోంది. ముందు ఏడుపు మానెయ్యి" అని వెంకట్రామయ్య కొంచెం ముందుకు జరిగాడు.

గోపాలం అప్పటికి నానాతిప్పలూ పడి ఏడుపును బైటికి రానివ్వకుండా పట్టుకోగలిగాడు. కాని లోపల కుమిలిపోతూనే ఉన్నాడు.

"ఇంకా చూస్తావేం? తియ్యి పుస్తకం."

గోపాలం చెయ్యి పుస్తకం తీసుకుంది.

"బొట్టుపెట్టి చెప్పాలా ఏమిటి చదవమని"

గోపాలంనోరు చదవడం మొదలుపెట్టింది. మధ్యమధ్య వస్తున్న ఏడుపుతో మాటలు బైటికి వస్తున్నాయి.

"ఆ పని మొదట్లోనే చేస్తే ఇంత ఏడు పెందుకూ?" అని అన్నాడు వెంకట్రామయ్య — ఏట్లాగైతేనేం కొడుకుచేత చదివించ గలిగానన్న సంతృప్తితో.

"చాలా కష్టపడ్డారుగాని భోజనానికి లేవండి" అని ఇందాకటినుంచీ కాచుకుకూర్చున్న రుక్మిణమ్మ భర్త నుద్దేశించి అన్నది.

"నోరుముయ్యి! ఏమి టాతొందరింపు! నీ మూలానే ఆ వెధవ ఇట్లా తయారవుతున్నాడు. నీ కొడుకు చదువుకోవడం ఇష్టంలేక పోతే పనిమనిషిని మానిపించి అంట్లుతోమించు." అని అంటూ వెంకట్రామయ్య దూకుడుగా దొడ్లోకి స్నానానికి వెళ్లాడు.

రుక్మిణమ్మ మాఱుమాటాడలేదు. తండ్రి వెళ్లాడన్న ధైర్యంతో తన వంకకు చూస్తున్న కుమారునివైపు జాలిగా చూచి భర్త కోసం లోపలికి వెళ్లిం దాఇల్లాలు.

తండ్రి భోజనం చేసి వచ్చేటప్పటికి గోపాలం పుస్తకం ఒళ్లో పడేసుకుని బీర్వాకు జేర్లబడి ఏడ్చిఏడ్చి నిద్రపోయాడు.

## 2.

రాత్రి జరిగిందంతా మరిచిపోయి గోపాలం తెల్లవారుజామునే రోజూమాదిరిగా తండ్రికంటెముందే నిద్రలేచాడు. అనర్గళ ధారతో పాఠాలు చదువుకున్నాడు.

తండ్రి నిద్రలేచేటప్పటికి గోపాలంస్నానం పూర్తిఅయింది.

తండ్రిస్నానం కాకముందే కుమారుడు భోజనం చేసేశాడు.

ప్రైవేటుమాస్టారిముందు గోపాలం కూర్చున్న అరగంటకి కాని వెంకట్రామయ్యగారి కాఫీ పూర్తికాలేదు.

తీరా ఆయన కాఫీకానిచ్చి బయటికి వచ్చేసరికి ఎవరో పెద్ద మనుష్యులు మాట్లాడడానికి వచ్చారు. వారిని సాగనంపడం గంటకు గాని తెములలేదు. ఆలోగా ప్రైవేటుమాస్టరు వెళ్లనే వెళ్లాడు.

అప్పటికే ఆఫీసు వేళకూడా అయింది. అందుచేత కొడుకు చదువువిషయం మళ్లీ పరామర్శ చెయ్యడానికి ఆయనకు తీరుబడి కాలేదు.

మాస్టరు వెళ్లిపోయినా గోపాలంమాత్రం కూర్చున్న చోటనే ఉండి పుస్తకం చేతిలోనే ఉంచుకుని ఊర్ధ్వాధోదిశలుతప్ప తక్కిన అన్నిదిశలకూ బొంగరంమాదిరి తిరుగుతున్నాడు. తండ్రి ఆఫీసుకు వెళ్లితేగాని అతను అక్కడనుంచి కదలడానికి వీల్లేదు.

అన్నయ్య కూర్చున్న గదిలోకి చెల్లాయి వెళ్లి అతని చేతిలోనుంచి పుస్తకం లాక్కున్నది. మొదట్లో గోపాలానికి చాలా సంతోషం వేసింది పుస్తకంవదిలిందిగదా అని. కాని వెంటనే తండ్రి జ్ఞాపకంవచ్చాడు. హడలిపోతూ, నెమ్మదిగా, పుస్తక మిమ్మని చెల్లాయిని బతిమాలుకున్నాడు. ఇతె నెంత నెమ్మదిగా అడిగాడో అంత గట్టిగా నే 'నివ్వనంటూ' గునిసింది చెల్లాయి. తాను గనక ఇంకొంచెం బలవంతం చేశాడా అమ్మాయి రాగం తీస్తుంది. దాంతో తండ్రి వస్తాడు. చెల్లాయిని ఏడిపించినందుకు వీపు చిట్లగొడతాడు. గోపాలం ఆలోచించాడు. చెల్లాయిచెవిలో చిన్న రహస్యం చెప్పి పుస్తకం తీసుకుని దాచాడు.

తండ్రి భోజనంచేసి చెయ్యి కడుక్కొనేందుకు దొడ్లోకి వచ్చేటప్పటికి అమ్మాయి చెట్టుకింద, అబ్బాయి చెట్టుమీదా ఉన్నారు.

నీళ్లు పుక్కిలించి ఉమ్మేస్తూ "ఇప్పుడు జామకాయ లెందుక్రా ధడవల్లారా!" అని గద్దించాడు తండ్రి.

చెయ్యిపట్టు తప్పి గోపాలం కింద పడిపోయాడు. మోకాలు జేనెడుమేర కొట్టుకుపోయి నెత్తురుకారింది.

గోపాలం తనంతట తానే లేచి నించోగానే ఎదురుగుండా తండ్రిని చూచాడు.

ఏ మాత్రం వ్యవధి లేనేలేదు.

"ఇంకెప్పుడైనా చెట్టు ఎక్కుతావా? మాట్లాడవేం? ఎక్కవుగదా!" అని అంటూ తలమీదా, వీపుమీదా దెబ్బలు వేస్తూ, చెవిపట్టుకుని ఇంట్లోకిఈడ్చుకువచ్చాడు. "అమ్మో, అమ్మో" అని ఏడుస్తూ, మధ్యమధ్య "ఎక్కను ఎక్కను" అని సమాధానం చెప్పుతూ గోపాలం గోలపెట్టేశాడు.

తల్లి ఇస్తున్న చనువుతో అబ్బాయిచదువంతా తగలడిపోతోందని పెద్ద ఆవేశంతో ఉపన్యాసం చెప్పి అనాడు వెంకట్రామయ్య అరగంట ఆలస్యంగా ఆఫీసుకు వెళ్లాడు.

తండ్రి బయటికి వెళ్లాక తల్లి వచ్చి ఎంత బతిమాలుకున్నా వినక గోపాలం మూలకూర్చుని ముక్కుతూనే ఉన్నాడు.

## 3

ఒంటిగంట కొట్టారు.

కొత్తగా వచ్చిన చుట్టాన్ని చూడడంతోటే అంతకు ముందు అణగారిన గోపాలందుఃఖం ఒక్కమాటు ఉప్పెనగా పైకి వచ్చింది.

రామకృష్ణయ్య పిల్లింటికి వచ్చి మూడేళ్లు కావస్తోంది. తాను వచ్చిరావడంతోనే మేనల్లుడు ఇంతగా గోలపెట్టి ఏడవడం అతని కెంతో కష్టాన్ని కలిగించింది. ఎంతకూ తరగకుండా దేవుకుదేవుకు వస్తున్న వాడి దుఃఖం చూచి మామయ్యగుండె మంచినీళ్లమూట అయింది.

"ఏంరా గోపీ! ఎందుకురా అట్లా ఏడుస్తావు?" అంటూ దగ్గరకువెళ్లి, ముఖాన్ని కప్పిన చేతులు తీస్తూ గోపాలాన్ని బుజ్జగించబోయాడు రామకృష్ణయ్య.

ఈ మాట వింటూనే రుక్మిణమ్మ "నువ్వు ఎప్పుడొచ్చావు అన్నయ్యా! ఇంటిదగ్గరంతా క్షేమమేనా?" అని అంటూ సావిట్లోకి వచ్చింది.

గోపాలం తన చేతులు లాక్కుని మరింత విజృంభించి ఏడవడం మొదలుపెట్టాడు.

"అవునుగాని, వీ డెందు కిట్లా ఏడుస్తాడు?"

"ఎందుకేమిటి? వాడి కర్మం, నాకర్మం! ఏళ్లు వచ్చిన కొద్దీ మీ బావకు మతిపోతోంది. చూడు, వాడి మొహం చూడు. నిన్నరాత్రినుంచీ ఈవరసన ఏడుస్తున్నాడు" అంటూ రుక్మిణమ్మ విసుక్కుని "నువ్వు లేచి స్నానం చెయ్యి! భోజనం చేద్దువుగాని. ఇదిప్పుడూ ఉన్న దేలే! నీవెంబడ నా వాడూ లేస్తాడు!" అన్నది.

పదేళ్ల మేనల్లుణ్ని రామకృష్ణయ్య అమాంతం లేవదీసి ఎత్తుకుని కితకితలు పెడుతూ "నువ్వు వడ్డించు, మేమిద్దఱమూ వస్తున్నాము." అన్నాడు. మామయ్యచేసిన ఆ ఒక్క చేష్టతో, అన్న ఆ ఒక్కమాటతో గోపాలం పుట్టెడు దుఃఖమూ ఇందుపగింజగీసి నట్లు విరిగిపోయింది.

గోపాలం మామయ్యపక్కన కూర్చుని భోజనం చేశాడు. మామయ్యకు మడతమంచంమీద పక్క వేసి తానుగూడా ఆయన పక్కన పడుకున్నాడు. మామయ్య చెప్తున్న కథ వింటూ, స్వర్గంలో ఉన్నట్లు భావిస్తూ గోపాలం ఒళ్లు తెలియకుండా నిద్ర పోయాడు.

రామకృష్ణయ్యకు నిద్రపట్టలేదు. మేనల్లుణ్ణిగూర్చి ఆలోచిస్తు న్నాడు. అంతలో రుక్మిణమ్మ పనిముగించుకుని గడపదగ్గఱ కూర్చుని కదిలించింది.

"గోపి నిద్రపోయాడా అన్నయ్యా?"

"అవునమ్మా! ఏడ్చిఏడ్చి ఉన్నాడాయె! ఇందాకనే నిద్రపోయాడు పాపం!"

"ఏంపాపమోగాని, అన్నయ్యా! నా కీసంసారమంటే విసుగెత్తిపోతోంది. వీడు పెద్దదిక్కు లేకపోయె! ఈయన కేమో రోజురోజుకూ ఇట్లా అయిపోతున్నారు."

"నేనూ అయననూ చూస్తే అనుకుంటున్నాను. నాకేమీ అర్థం కావడం లేదు. గోపి ఏమైనా అల్లరివాడా అంటే కానేకాదు. పోనీ, మొద్దుఅందామా అంటే వీడికున్న తెలివితేటలు ఆయనకు గూడా ఉన్నట్లు తోచదు!"

"నేను మథనపడుతున్నదీ ఇందుకే అన్నయ్యా! తండ్రి అంటే పిల్లలకు భయము ఉండనక్కర్లేదని ఎవ్వరూ అనరు. చిన్న వాళ్లకు పెద్దవాళ్లంటే భయమూ, భక్తి ఉండవలసిందే. కాని ఇదొక్కడి భయం బాబోయి! ఆయన కంటబడ్డారంటే పెద్దపులిని చూసినట్టే వాడు!"

"మరి అంతభయమైతే ఇక వాళ్లచేత మనం ఏం చేయించ గలం?"

"ఇప్పుడు జరుగుతున్నదే అది. వాడంతట వాడు చక్కగా చదువుకుంటాడు. ఒక్క తప్పు లేకుండా ఏరోజుపాఠం ఆరోజు మాస్టరుకు అప్పచెప్తాడు. కాని ఈయన వచ్చి కూర్చుంటే సరి, నోట్లోనుంచి మాటరాదు పాపం. వచ్చినా తప్పులు. దాంతో వాణ్ణి చావబాదడం. ఇదీ పరిస్థితి. ఏరోజూ వాడేడవకుండా గడవనేగడవదాయె ఈ కొంపలో!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుందిపాపం రుక్మిణమ్మ.

రామకృష్ణయ్య చెల్లెలికళ్లు చూచి నిర్ఘాంతపోయాడు. వెంకట్రామయ్య ఎందు కింత కర్కోటకుడయ్యాడో అతని కేమీ అర్థంకాలేదు.

రుక్మిణమ్మ కళ్లనీళ్లు తుడుచుకుని మళ్లీ అందుకుంది:

"నువ్వు చెప్పు అన్నయ్యా! ఎవరైనా పుట్టగానే తమంత వాళ్లు కాగలరా? పొద్దస్తమానమూ పుస్తకాలుపట్టుకు కూర్చో మంటే పసివాడు ఏం కూర్చుంటాడు? కన్నబిడ్డగదా అని దేరదీసి ఒకమాట అనడం, ఒక ఆటవస్తువు కొనిఇవ్వడం, వెంబడి ఎక్కడి కైనా తీసుకువెళ్లడం ఇట్లాంటి ముద్దూ ముచ్చటా రవ్వంతైనా లేదాయె. ఏమో బాబూ! ఈ కొంపలో పిల్లలు పుట్టడంకంటే నరకంలో పడడం మేలనిపిస్తోంది."

"అవును మరి అంతే! పిల్లలంటూ ఉన్నాక చనువు చూపకపోతే ఎట్లా? ఒకపక్క చనువూ ఇస్తుండాలి; మరోక పక్క భయమూ పెట్టుతుండాలి. అంతేగాని ఏదొక్కటయినా కష్టమే!"

"ఎక్కడా మతీ ఎక్కడా? వాళ్లి కొట్టే కొట్టడానికి హాసుండే లదిరిపోతున్నాయి. పక్క ఇంటికి పోగూడదు. ఇంట్లో తిరగగూడదు. పగలల్లా ఆ గదిలో కూర్చుని అట్లా పుస్తకాలు చేతుల కంటుకుపోయేటట్లు చదువుకోవాలి. ఇంత చిన్నతనంలో ఏ మహానుభావు లిట్లా చదివారో ఏమో!"

"అదేమిటి చెల్లీ, గోపిని బడికిగూడా పంపించడా ఏమిటి?"

"బడీ లేదు, బండలూ లేదు. అడ్డమైనవాళ్ల స్నేహాలూ చేసి చెడిపోతా డంటారు. ఆమాటా నిజమే. ఈరోజుల్లో ఈబళ్లు కాదుగాని, వేలెడుజేసెడువాళ్ల దగ్గఱనుంచీ చెడవలవాట్లతో పాడై పోతున్నారు. అందుకు సేసేమీ అనను. మన కట్లాంటి అభిప్రాయా లున్నప్పుడు వాడి వయసుని గమనించి ఏదో ఇంత ఆటాపాటా, తోడూ దొంబాటా వీటి కేమైనా అవకాశం ఇవ్వాలంటావా అక్కర్లేదంటావా?"

"అదేమ్మాట! అక్కర్లేకపోవడమేం? అవేమీ లేకపోబట్టే మళ్ళీ ఇంత దిగులుపడి, నాన్న భయంతో పట్టి పిరికివా డయిపోయాడు, పిచ్చివెధవ!" అని మేనల్లుడి వీపుమీద చేత్తో రాస్తూ అన్నాడు రామకృష్ణయ్య.

గోపాలం 'మామయ్యా' అంటూ ఉలిక్కిపడి లేచికూర్చుని కళ్లు తుడుచుకోవడం మొదలుపెట్టాడు.

"అదేమిటిరా నాన్నా! అట్లా కంగారుగా లేచావ్!" అంటూ మామయ్య మేనల్లుణ్ని తన పొట్టమీదికి లాక్కున్నాడు.

కాఫీప్రయత్నానికి రుక్మిణమ్మ లోపలికి వెళ్లింది.

## ౪

మామయ్యఎడం చెయ్యి చిటికెనవేలు పట్టుకుని గోపాలం నడుస్తున్నాడు. లేదు, నడవడం లేదు, గాలిలో తేలిపోతున్నాడు.

ఎదురింటివాళ్ల అబ్బాయి పెట్టుకున్న బెల్టూ, పక్కింటి రాముడి బాటూ, వాళ్లమ్మాయిమోటారూ, వీళ్ల బ్బాయిబూరా అన్నీ అతనికి కనబడుతున్నాయి. గోపాలం తానేదో గొప్ప ప్రపంచంలో ఉన్నట్లు అనుకుంటున్నాడు. అందరికీ అన్నీ ఉన్నాయి. తనకే ఒక్కటీ లేదు. తనకూ అన్నీ కావాలి.

"మామయ్యా! మామయ్యా! ఈబంతి కొనిపెట్టవూ? అబాటు కొనవూ?" అని అడిగి, ఎన్ని అడిగినా వినుకోకుని మామయ్య చేత అన్నీ కొనిపించుకున్నాడు. మోయలేని సంతోషంతో ఆ వస్తువులన్నీ తనే మోస్తూ మామయ్యవెంబడి గోపాలం ఎంత నడిచాడో అతనికే తెలియలేదు.

దారిలో నడుస్తూ "చూడు చూడు మామయ్యా! ఈబంతి ఎట్లా ఎగురుతోందో" అని అంటూ బంతి పడేసేటప్పటికి చంకలో వస్తువులుగూడా కింద పడిపోయాయి.

అవి తీసుకుంటున్న గోపాలానికి సహాయంచేసి, కొన్ని తాను తీసుకుని "వీధిలో జనంలో ఇట్లా ఆడకూడదు నాన్నా! బళ్లూగిళ్లూ వస్తాయి" అని రామకృష్ణయ్య మేనల్లుణ్ణి పక్కకు తీసుకు వచ్చాడు.

ఇంతలో నాలుగువీధులూ కలిసిన చోటుకు వచ్చారు. అక్కడ నుంచున్న పోలీసు 'బుయి'మని ఈల ఊదాడు. గోపాలం తన ఈల అంతకంటే గట్టిగా ఊదాడు.

"గోపీ! బజారులో నువ్వు ఈల వేసేటట్లయితే ఆ పోలీసు ఎందుకురా అక్కడ?"

"ఎందుకేమిటి? సరదాకే ఊదుకుంటున్నాడు కాదూ మామయ్యా!"



"మోయలేని సంతోషంతో ఆ వస్తువులన్నీ తనే మోస్తూ మామయ్యవెంబడి గోపాలం ఎంత నడిచాడో అతనికే తెలియలేదు."

"సరదాకు గాదు నాన్నా! అటునుంచి వస్తున్న కారుకు దారిఇవ్వడంకోసం ఇటు వస్తున్న బండిని ఈలవేసి ఆపుచేశాడు. కారు వెళ్లడంతోటే దీన్ని పోనిస్తాడు. ఆ పోలీసు చేసే పని అది."

"అందుచేత బజార్లో మనం ఈల వెయ్యకూడదు. అవునా మామయ్యా?"

'అవును' అంటూ మేనల్లుడి బుద్ధిమంతతనానికి సంతోషించి, వీపుమీద మెల్లగా తట్టుతూ, మీదికి వస్తున్న సైకిల్ని తప్పించి గోపాలాన్ని పక్కకి లాగాడు మేనమామ.

అప్పటికి ఆరున్నర అయింది.

గోపాలానికి వాళ్ల మామయ్య కొనిపెట్టిన బిళ్లలతో ఆకలే తెలియనేలేదు.

అయినా ఎందుకైనా మంచిదని అరడజను అరటిపళ్లూ, నాలుగు బత్తాయికాయలూ కొనిఇచ్చి మేనల్లుణ్ణి సినిమాకు తీసుకు వెళ్లాడు రామకృష్ణయ్య.

"ఇందులో ఏముంటుంది మామయ్యా!"

"బొమ్మలు చూపిస్తారురా? మాటలూ, పాటలూ, పద్యాలూ వీటితో మనకి కథ తెలుస్తుంది"

"బొమ్మ లెక్కడైనా మాట్లాడుతాయా".

"మాట్లాడవురా పిచ్చివాడా! మనం మాట్లాడినది తిరిగి మళ్లీ మనం అన్నట్లే వినిపించేందుకు వీలయే యంత్రం ఉంటుంది. దాన్ని గ్రామఫోనంటారు. ఫోటోలు తీసి బొమ్మలు చూపిస్తూ, అటువంటి యంత్రంసహాయంతో ఆ బొమ్మల నోటిలోనుంచి ఆ మాటలు వచ్చేటట్లు చేస్తారు. చూద్దుగానిగా!"

పాటలు వింటున్నకొద్దీ గోపాలంతన్మయత్వం ఎక్కువై పోతోంది. కుర్చీలో సరిగా కూర్చోలేకపోతున్నాడు.

ఇంతలో తెరమీద బొమ్మలు కనపడ్డాయి. గోపాలం సంచలిస్తున్నాడు. అప్పుడప్పుడు ఎగరడంకూడా మొదలుపెట్టాడు. రామకృష్ణయ్య వాడి సంతోషం చూసి కళ్లు పత్తికాయలు చేసుకుని ఆనందిస్తున్నాడు. గోపాలం ఏప్రశ్నా తోచనంత తన్మయత్వంతో చూస్తున్నాడు.

సినిమాలో అల్లరికృష్ణుడి దగ్గరకు వెళ్లాడని తన కొడుకును ఒక గొల్లఆయన కొడుతున్నాడు. వెంటనే గోపాలం "ఎందుకు మామయ్యా! అట్లా కొడతాడు? కొట్టవద్దని చెప్పవూ!" అన్నాడు.

"అవి బొమ్మలురా" అన్నాడు మేనమామ మేనల్లుడి కళ్లలోకి చూస్తూ.

"బొమ్మలైతేమాత్రం అట్లా కొట్టుకోవచ్చా మామయ్యా!"

రామకృష్ణయ్య పసివాని అమాయకత్వానికి జాలిగా చూచి "తప్పే నాన్నా! నువ్వు కూర్చుని చూడు. వెనకవాళ్లకు అడ్డు అవుతుంది!" అన్నాడు.

గోపాలానికి ఎందుకో మనసు కలుక్కుమంది. దిగాలుపడి కుర్చీలో కూర్చుని చూస్తున్నాడు.

అరగంట కాకుండానే అలా ముందుకు జారి కుర్చీలోనే నిద్రపోయాడు.

*

ఆరుగంటలకు ఆఫీసునుంచి వచ్చిన వెంకట్రామయ్య ఆటునూ అయినా అబ్బాయి నట్లా వీధిలోకి పంపడం తప్పని రుక్మిణమ్మను కోప్పడుతూ ఒంటికాలిమీద లేస్తూనే ఉన్నాడు.

ఈసారి ఆఖరవనే మాటలకు అంత ఓర్పు గల ఆఇల్లాలూ సహించలేకపోయింది.

"మూడేళ్ల కొకమాటు వచ్చే పెద్దమనిషి గాబట్టి ఇవాళ వెంటబెట్టుకువెళ్లాను. ఈ చెడుతిరుగుడు అలవాటయి రోజూ మారాంచేస్తే ఈయనతోటి ఎవడు తీసుకువెళ్తాడో పిల్లి. కాస్త ముందూ వెనకా ఆలోచనఉండక్కరలేదూ?"

చిరాకుతో పదినిమిషాలు ఆపనీ ఈపనీ చూచాక—

"ఏదో, చూడ్డానికి వచ్చినవాడు తిండి తిని పడిఉండక పిల్లాణ్ణెందుకంట వెంటబెట్టుకు తిరగడం?"

మళ్లీ నాలుగునిమిషాలు కాకుండానే —

"వాణ్ణని ప్రయోజనం ఏముంది? ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి గడ్డి తినే నిన్నననాలిగాని. అసలు నువ్వు ఎందుకు పంపించావంట పిల్లణ్ణి?"

"నే పంపించిందేముంది? 'రారా గోపీ' అని అన్నయ్యే పిల్చుకువెళ్లాడు!"

"వాడు పిలిస్తే పరిగెత్తి వెంబడిపడ్డాడే అనుకో! నువ్వు ఎక్కడ చచ్చావంట?"

"ఎక్కడా చావలేదు! చావక బ్రతికిఉండబట్టే 'పోనీ వెళ్లి వస్తాడులే' అని ఊరుకున్నాను."

"ఊరుకుంటావు! ఊరుకుంటావు! నేను మర్యాదగా ఊరుకున్నకొద్దీ నీ పొగరుబోతుతనం ఎక్కువౌతోంది. ఆపధవ అట్లా తయారుఅవుతున్నాడు."

"నామాట ఎట్లా ఉన్నా మీకోపంమాత్రం మహాఎక్కువవుతోంది. ఏమన్నా అంటే అమాంతం మీదికి లేస్తారుగాని వాడేం చెడిపోయాడు చెప్పండి?"

"ఇంకా చెప్పేదేముంది? ఇంత పొద్దుపోయింది, ఇంతవరకూ ఇంటిమొహం పట్టలేదు. ఇది చాలదూ" అని అంటూ ఉండగానే వాకిట్లో జట్కాచప్పుడయింది.

అనుకుంటుండగా వచ్చారుగదా అని రుక్మిణమ్మ అమాయకంగా మనసులోనే వాళ్ల ఆయుస్సు ఆశించింది.

వెంకట్రామయ్య మొహం ఇంతచేసుకుని బొమలుముడిచి ఎక్కడలేని గాంభీర్యమూ తెచ్చుకుని కుర్చీలో కూర్చున్నాడు.

గోపాలానికి బండి సగందూరం వచ్చేవరకూ మెలకువే రాలేదు. బండికుదుపుకు అమాంతం మేలుకుని కళ్లు నులుముకుంటూ "దీంట్లో ఎక్కడికి మామయ్యా?" అని అడిగాడు.

"ఇంటికి నాన్నా!" అన్నాడు మేనమామ.

గోపాలంగుండెల్లో రాయిపడింది.

ఇంటికి, అంటే నాన్నదగ్గరికి, అందులో ఈరాత్రివేళ, పైగా ఇన్ని తనకోసం కొన్న వస్తువులతో—వరసవరసగా డిగ్రీల

తరబడి భయం హెచ్చిపోయింది. ఒదిగిఒదిగి మామయ్యడొక్కలో దూరాడు. ఉండిఉండి ఉలిక్కిపడుతున్నాడు పాపం!

మేనమామ చెయ్యివేసి మేనల్లుణ్ణి మరీదగ్గరకు తీసుకున్నాడు.

"మామయ్యా!"

"ఏం నాన్నా!"

గోపాలం ఏమీ మాట్లాడలేకపోయాడు. గుడ్లు అప్పచెప్పి మామయ్యవంక చూచాడు.

"ఎందుకు నాన్నా! అట్లా చూస్తావు? నీ కేం భయం లేదులే" అంటూ వీపుమీద చెయ్యివేసి రాస్తూ బుజ్జగించాడు మామయ్య.

గోపాలం అట్లాగే చూసిచూసి "నే నడిగానని చెప్పకేం మామయ్యా! నాన్నతో" అని అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

రామకృష్ణయ్యగుండె తరుక్కుపోయింది.

ఉత్తరీయంకొంగుతో కళ్లు తుడుస్తూ "పిచ్చినాన్నా! చెప్పనులే. అయినా నేనున్నానుగా. మీ నాన్న నిన్నేమీ అనడు. నువ్వు అట్లా ఏడవకు. నవ్వుతూ కూర్చో" అన్నాడు రామకృష్ణయ్య.

బండి ఇంటిదగ్గరకు రావడంతోటే సామాన్లన్నీ తన చేసంచిలో పెట్టుకుని తాను ముందు దిగి ఇంట్లోకి వెళ్లాడు.

వెనకాలే గోపాలం నక్కినక్కి వస్తున్నాడు.

బావమఱదిని చూసిందే తడవుగా—

"వాడేడీ?" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇదుగో! వస్తూనేఉన్నాడు."

గోపాలం మామయ్యపక్కనే నించున్నాడు. పంచీ వంకకి తగిలించి మామయ్య లోపలికి వెళ్లగానే తానూ వెళ్లాడు.

వెంకట్రామయ్య కుర్చీలో కూర్చోలేకపోతున్నాడు. గోపాలం ఇంట్లో తిరగలేకపోతున్నాడు.

అన్న నంటిపెట్టుకు తిరుగుతున్న కొడుకును చూచి రుక్మిణమ్మ భయపడుతూనే ఉంది.

"ఒరేయి గోపీ!"

తండ్రిగొంతు విని గోపాలం స్నానాలగదిలో నుంచుని వణికిపోతున్నాడు.

రుక్మిణమ్మ అన్నాలని కొంచెం బిగ్గరగా "మీ ఇద్దరూ మడి గట్టుకోండన్నయ్యా" అన్నది.

వస్తున్నామని రామకృష్ణయ్య అనకముందే "ఇటు రావేంరా గోపీ!" అంటూ మళ్లీ కేక రానేవచ్చింది.

"పద నాన్నా, నేనూ వస్తున్నా" అని రామకృష్ణయ్య గోపీని వెంటబెట్టుకు లోపలికి వచ్చాడు.

మామయ్య పావిసిగదిలోకి వెళ్తున్నాడు. నాన్న పావిట్లో కుర్చీలో ఉన్నాడు. గోపాలం వంటింటి గుమ్మాని కతుక్కుపోయాడు.

వెంకట్రామయ్య లేచివాడికి దూకే పులిలా లేచాడు.

"రమ్మంటే రావేం? రావేమంటా? వినపడడంలేదూ" అంటూ చెయ్యి పుచ్చుకుని గోపాలాన్ని తన కుర్చీదగ్గరకు లాక్కువచ్చాడు.

గజగజలాడిపోతూ గొల్లుమన్నాడు గోపాలం.

పట్టుబట్ట కట్టుకుంటున్న రామకృష్ణయ్య అదరబాదరగా పరుగెత్తుకువచ్చి గోపాలాన్ని పొదివితీసుకుని "చాల్లేవయ్యా! మరీ ఎక్కువవుతున్నాయి వెలిదితేటలు. ఎట్లాగైతేనేం నువ్వే కన్నావులే కొడుకుని. మహాచక్కగా అరుపాజ్ఞల్లో పెడుతున్నావు! పసిప్రాణం ఇట్లా తల్లడిల్లిపోతుంటే మరీ హడలగొడతావేమిటి?"

"ఒరేయి రాముడూ! నువ్వు దూరంగా ఉండు. నాకు కోపం వచ్చిందంటే నేను మనిషిని గాను." అంటూ గోపాలాన్ని ఇవతలకు లాగాడు వెంకట్రామయ్య.

ఆ ఊపుకు మళ్లీ ఏడవడం మొదలుపెట్టాడు గోపాలం.

రామకృష్ణయ్య నిర్ఘాంతపోయాడు.

"ఇప్పుడు నిన్ను ఏం చేశా'నని'రా అంత ఏడుస్తావు? ముందు ఏడుపు మానెయ్యి! మానావా మానవా?" అంటూ ఒక దెబ్బ వేశాడు వెంకట్రామయ్య—'బావా' అని కేక వేస్తున్న రామకృష్ణయ్యమాట వినిపించుకోకుండానే.

మామయ్యచేతిలోనుంచి తండ్రి తన్ను ఇవతలకు లాగడంతో ఎంత అస్థైర్యపడిపోయాడో ఏమో గోపాలం ఆ దెబ్బతో వెన్ను వెంబడి జలజలలాడిపోయి కిందపడబోయాడు. రామకృష్ణయ్య చటుక్కున వాణ్ణి రెండు చేతుల్తోనూ పట్టుకుని ఎత్తుకున్నాడు.

వాడికి వణుకు ఆగలేదు.

అల్లుణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు మేనమామ. గోపాలం ఇంకా వణుకుతూనేఉన్నాడు.

రామకృష్ణయ్య వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి బాగా దుప్పట్లు కప్పి తాను పక్కనే కూర్చున్నాడు. కంటికీ నేలకూ ఏకధారగా ఏడుస్తూ రుక్మిణమ్మ మైలపడి మంచంపక్కనే కూర్చున్నది. ఆ వణుకువణుకు అట్లా పావుగంటసేపుండి నూటమూడు డిగ్రీల జ్వరాన్ని విడిచిపెట్టి మరీ వెళ్లింది.

వెంకట్రామయ్యకు దిక్కుతోచలేదు. దిగాలుపడి అట్లా కుర్చీలో కూర్చుండిపోయాడు.

భోజనానికి కట్టుకున్న పట్టుబట్టతోనే రామకృష్ణయ్య మేనల్లుడికి పరిచర్య చేస్తున్నాడు.

ఒకగంట అయ్యాక తెములుకుని వెంకట్రామయ్య పక్కింటి శాస్త్రిలుగారిని నిద్రలేపి విభూతి పెట్టించుకువచ్చాడు. గోపాలం వంటినిండా తావుగా విభూతి రాశాడు.

జ్వరమైతే తగ్గలేదుగాని మేనమామ చేసిన పరిచర్యలవల్ల గోపాలానికి కొంచెంగా నిద్రపట్టింది. అదైనా కలతనిద్ర.

రాత్రి తెల్లవార్లూ మగ్గుతూ గోపాలంమంచందగ్గిరే కూర్చున్నారు.

౬

తెల్లవారింది. గోపాలంజ్వరం ఒకడిగ్రీ ఎక్కువయినట్టుందిగాని ఏమాత్రమూ తగ్గలేదు. వెంకట్రామయ్యకు నిజంగా భయమే వేసింది. ఒక్కనిమిషం ఆగకుండా వెళ్లి డాక్టరును పిలుచుకు వచ్చాడు.

కళ్లు మూసుకునిఉన్నా రాత్రల్లా అప్పుడప్పుడు ఉలిక్కిపడుతూనే ఉన్నాడు గోపాలం. డాక్టరు రాబోయేముందే పావుగంటనుంచీ కొంచెం కదలకుండా నిద్రపోతున్నాడు.



"రామకృష్ణయ్య వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి తానూ పక్కనే కూర్చున్నాడు. రుక్మిణమ్మ కంటికీ నేలకూ ఏకధారగాపడుస్తూ మంచం పక్కనే కూర్చున్నది. వెంకట్రామయ్య దిగాలుపడి అట్లాగే కుర్చీలో కూర్చుండి పోయాడు."

డాక్టరు వచ్చి చెయ్యిపట్టుకు చూస్తున్నాడు. నాడి అతివేగంగా కొట్టుకుంటోంది. ఒళ్లుతాకితే నిప్పులో చెయ్యిపెట్టినట్లుంది. అరనిమిషంసేపు నుదుటిమీద చెయ్యిపెట్టి ఉంచాడు డాక్టరు. రామకృష్ణయ్య 'గోపీ! గోపీ!' అని మెల్లగా చెవిదగ్గర నోరుపెట్టి అన్నాడు. గోపాలం ఉలిక్కిపడి "మామయ్యా! నాన్న. అవన్నీ అవతలపారెయ్యి!" అంటూ కలవరించాడు.

రామకృష్ణయ్య కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

రుక్మిణమ్మ భర్తకళ్లల్లోకి చూచింది. వెంకట్రామయ్య తల వంచుకున్నాడు.

డాక్టరుకిదేమీ అర్థంకాలేదు.

కన్నీళ్లు తుడుచుకుంటూ రామకృష్ణయ్య సంగతంతా చెప్పాడు.

డాక్టరు ఆశ్చర్యపోయాడు.

వెంకట్రామయ్యను తీసుకువెళ్లి డాక్టరు మందిచ్చి పంపించాడు.

ఆ మందు తాగి గోపాలం హాయిగా నిద్రపోయాడు.

ఆపూట ఇంటిల్లిపాదీ ఏమాత్రమూ సయించకుండానే నాలుగు మెతుకులు ఎంగిలిపడ్డారు.

వెంకట్రామయ్య కొడుకుదురవస్థ చూసి లోపల్లోపల కుమిలిపోయాడు. గోపాలం కలవరించిన నాలుగుమాటలూ అతని మనస్సును మథించేస్తున్నాయి. చేతుల్లో తలపట్టుకుని మంచంపక్కనే చతికిలబడ్డాడు.

జ్వరం తగ్గుముఖం పట్టిందిగదా అని రాత్రి నిద్రలేని కారణాన రామకృష్ణయ్య నేలమీదనే నడుంవాల్చాడు.

వెంకట్రామయ్య కిల్లా వాకిలీ, తన జీవితమూ అంతా సర్వశూన్యమనిపించింది మంచంమీద పడిఉన్న తన కొడుకును చూస్తుంటే.

రెండుగంటలవేళ గోపాలం కళ్లు తెరిచి 'మామయ్యా!' అన్నాడు. వెంకట్రామయ్య కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లయింది.

గోపాలంమీదికి వాలి "ఏం నాన్నా!" అన్నాడు.

'ఆకలి' అని గోపాలం కళ్లు మూసుకున్నాడు.

దగ్గిర కూర్చుని నాలుగు బత్తాయితొనలు తినిపించాడు. గోపాలం కళ్లు మూసుకునే తిన్నాడు. వెంకట్రామయ్య కొడుకుమీదపడి "నాన్నా, ఇటు చూడు" అని కళ్ల వెంబడి నీళ్లు పెట్టుకున్నాడు.

గోపాలం అతికష్టంమీద తెరిచాడు. కాని తండ్రికళ్లల్లోనుంచి నీళ్లుపడి వెంటనే మూసుకున్నాడు.

నుదుటిమీద చెయ్యివేసి రాస్తూ "గోపీ! జ్వరం పోయింది. లే నానా! ఆడుకుందువుగాని" అంటూ వెంకట్రామయ్య మంచం కింద తాను పెట్టిన సంచిలోని బంతి తీసి గోపాలంచేతులో పెట్టాడు.

తనమీదికి వాలిన తండ్రిని మంచంమీద పడుకున్న గోపాలం ఒక చేతిలో బంతి ఉండగా 'నాన్నా!' అంటూ కౌగిలించుకున్నాడు.